క్లుప్తంగా

ఈ-కేవైసీ తప్పనిసరి

పుట్లూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించనున్న అన్నదాత సుఖీభవ కోసం రైతు సేవా కేంద్రాల్లో రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి కాత్యాయని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ఈ పథకం కింద 8,255 మంది రైతులు ఈ-కేవైసీ చేసుకోవాల్సి ఉందన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను తనిఖీ చేసి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం నవోదయం కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మద్యం, గంజాయిపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ నాయుడు, ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్యశాల అటెండర్ మృతి

యల్లనూరు: మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న అటెండర్ అనిల్ (34) అనారోగ్యంతో మృత్యువాత పడ్డారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. గురువారం వైద్యం కోసం పులివెందులకు వెళ్లి బంధువుల ఇంట్లో ఉండగా అస్వస్థకు గురయ్యాడు. మెరుగైన వైద్యం కోసం కడపకు తరలిస్తుండగా ఆయన మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతిపై పశు వైద్యశాల సిబ్బంది సంతాపం తెలిపారు.

ఏఓ బాధ్యతల స్వీకరణ



లీణా వసుంధర

గుంతకల్లు రూరల్: మండల వ్యవసాయశాఖ అధికారిగా శుక్రవారం డీ.లీణా వసుంధర బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏఓగా పనిచేస్తున్న విజయ్ కుమార్‌కు పామిడికి బదిలీ కాగా, పామిడి ఏఓ లీణా వసుంధర గుంతకల్లు మండలానికి బదిలీ అయ్యారు. రైతన్నల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

ఆటోలో నుంచి జారి పడి వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని కోళ్ల ఫారం వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోలో వెనుక కూర్చొన్న రామాంజనేయులు అనే వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడి గాయపడ్డాడు. ప్యాపిలికి చెందిన రామాంజనేయులు పని మీద గుత్తికి వచ్చాడు. తిరిగి ప్యాపిలికి ఆటోలో బయలుదేరాడు. అయితే స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో కుదుపుకు జారి కిందపడ్డాడు. గాయపడిన రామాంజనేయులును స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

గుంతకల్లుటౌన్: స్థానిక ఆలూరు రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ నాగేంద్ర, ఏఈ రఘునాథ్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని భాగ్యనగర్, హనుమేష్‌నగర్, ఉమామహేశ్వరనగర్, మండీ బజార్, మోదినాబాద్, బెంచికొట్టాల, పోర్టర్స్ లైన్ తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదానం చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి

గుంతకల్లు: ప్రతిఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేయాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక, ప్రగతి మైత్రి మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ, తహసీల్దార్ రక్తదానం చేసి ఆదర్శంగా నిలవగా వారితోపాటు మరికొందరు రక్తదానం చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఆజేంద్రరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి, సంఘ సేవకుడు మేస్త్రీ దొడ్డప్ప, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ మస్తాన్‌యాదవ్, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, ప్రగతి మైత్రి మహళ సంఘం మేనేజర్ రమేష్, అబ్దుల్ కలాం స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ తదితరులు పాల్గొన్నారు.

నీరుగారుతున్న లక్ష్యం

ప్రతి నీటిబొట్టునూ సంరక్షిద్దాం..నీటి వృథాను అరికడదామన్న ప్రభుత్వ ప్రకటనలు కార్యరూపం దాల్చడంలేదు. సత్యసాయి తాగునీటి పథకం పైప్‌లైప్ లైన్లు తరచూ లీకేజీ అవుతుండడంతో గ్రామీణులకు నీరందక లక్ష్యం నీరుగారుతోంది. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో నెలల తరబడి పైప్ లైన్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు

- తరచూ 'సత్యసాయి పథకం' పైప్‌లైన్ల లీకేజీ
- వృథా అవుతున్న తాగునీరు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పామిడిలోని సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ పంప్‌హౌస్



గుత్తి బీసీసీ రోడ్డుపై లీకేజీ నీటి ప్రవాహం

పామిడి: పామిడి సమీపంలోని పెన్నానది నుంచి గత 25 ఏళ్లుగా పెద్దపెద్ద యంత్రాల సాయంతో నీటిని తోడి సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ ద్వారా పామిడితో పాటు గుత్తి, నంద్యాల, కర్నూలు జిల్లాలోని రూరల్ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. అయితే పామిడిలో సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ పైప్‌లైన్ తరచూ లీకేజీలకు గురవుతోంది. నిత్యం గుత్తి బీసీసీ రోడ్డు పొడవునా ఏదో ఒకచోట పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేసేవారే కరువవ్వడంతో లీకేజీ నీరంతా రోడ్డుపై మడుగును తలపిస్తోంది. దీంతో పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

రోజుకు 30 లక్షల లీటర్ల నీరు సరఫరా

పామిడితో పాటు గుత్తి, ప్యాపిలీ, డోన్ వంటి నంద్యాల, కర్నూలు జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంతాలకు పామిడి పెన్నానది నుంచి రోజూ 30 లక్షల లీటర్ల నీరు సరఫరా అవుతోంది. రోడ్డు పొడవునా పైప్‌లైన్ లీకేజీలతో గ్రామీణ ప్రాంతాలకు సక్రమంగా నీరు సరఫరా అవ్వడం లేదు. లీకేజీతో నీరంతా వృథా అవుతోంది. దీంతో సత్యసాయిబాబా వాటర్ ప్రాజెక్ట్ లక్ష్యం నీరుగారుతోంది. సంబంధితాధికారులు ఎవ్వరూ అందుబాటులో లేకపోవడంతో నెలలు గడిచినా పైప్‌లైన్‌లకు మరమ్మతులు చేసేవారే కరువవడంతో నీరంతా వృథా అవుతోంది. ప్రతి నీటిబొట్టునూ సంరక్షిద్దాం-నీటి వృథాను అరికడదామన్న ప్రభుత్వ ప్రకటనలు కార్యరూపానికి నోచుకోవడం లేదు. అలాగే సత్యసాయి శివైక్యం అనంతరం జీతభత్యాల్లో సైతం తీవ్ర జాప్యం జరుగుతోందని ప్రాజెక్టులో పనిచేసే సిబ్బంది వాపోయారు.

నీరంతా రోడ్డుపాలు



సత్యసాయి బాబా వాటర్ ప్రాజెక్ట్ నిర్వాహణ మునుపటిలా లేదు. తరుచూ పామిడిలో ప్రాజెక్ట్ పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. దీంతో నీరంతా వృథాగా రోడ్డు పాలు అవుతోంది. లీకేజీ నీటివల్ల రోడ్లు బురదమయమవుతోంది. దీంతో వృద్ధులు జారిపడి గాయాలపాలైన సందర్భాలు లేకపోలేదు. అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేయాలి.
–వీరయ్య, పామిడి

రాకపోకలకు ఇబ్బంది



పామిడిలోని గుత్తిబీసీసీ రోడ్డుకు ఏదో ఒకచోట నిత్యం సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ పైప్‌లైన్ పగిలి పోతోంది. దీంతో వృథా నీరంతా రోడ్డుపై పారుతుండడంతో వాహన చోదకులు, పాదచారుల రాకపోలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వృథా నీటి ప్రవాహం వల్ల బీటీ రోడ్డు దెబ్బతింటోంది. అలాగే వాహనచోదకులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు.
–బుజ్జిబాబు, పామిడి

ప్రమాదకరంగా నీటి గుంత



పామిడి కొత్త ఆర్టీసీ బస్టాండ్ సమీపాన పులుసు కాలువ వద్ద బీసీసీ రోడ్డుకు ఆనుకుని పైప్‌లైన్ లీకేజీ మర్మతుల కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారింది. ఆరు నెలలు అవుతున్నా పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులకు నోచుకోలేదు. ఈ రోడ్డుపై చిన్నారులు పాఠశాలలకు వచ్చి వెళ్తుంటారు. చిన్నారులు ఈ గుంతలో పడితే ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోవాల్సిందే. –వరప్రసాద్, పామిడి

భర్త ధర్మవరంలో.. భార్య పామిడిలో

- నిబంధనలకు విరుద్ధంగా 'స్పౌజ్' కోటా టీచర్ బదిలీ
- విద్యాశాఖ వివాదాస్పద నిర్ణయం

అనంతపురం ఎడ్యుకేషన్: 'స్పౌజ్'కోటా టీచర్ బదిలీలో విద్యాశాఖ అధికారులు వివాదాస్పద నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. స్పౌజ్ కోటా కింద బదిలీ అయ్యే టీచర్లు.. స్పౌజ్ పని చేస్తున్న సమీపంలోకి వెళ్లాల్సి ఉంటుంది. ఈ విషయంలో కమిషనర్ విజయ రామరాజు చాలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం జరిగిన కౌన్సెలింగ్‌లో భర్త ధర్మవరంలో పని చేస్తుంటే.. భార్యను పామిడి మండలానికి బదిలీ చేశారు. అంతకు ముందు దాకా అదే పాఠశాలలో ఖాళీగా ఉంటే స్పౌజ్‌ను కూడా అక్కడికే పంపిన అధికారులు.. ఈమె విషయంలో మాత్రం తప్పుడు నిర్ణయం తీసుకోవడం వెనక అంతర్యం ఏమిటనే చర్చ జరుగుతోంది. స్పౌజ్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న టీచర్లకు స్పౌజ్ సర్టిఫికెట్‌ను ఒకటికి రెండుసార్లు పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. మరి పామిడికి పంపిన టీచర్ విషయంలో ఇలా ఎందుకు జరగలేదనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఓ కీలక అధికారి ఆదేశాల మేరకు ఉద్యోగులు కావాలనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఏది ఏమైనా వివాదాస్పద నిర్ణయం తీసుకున్న విద్యాశాఖ అధికారులపై సామాన్య టీచర్లు మండిపడుతున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. ప్రసాద్ బాబును వివరణ కోరగా.. సంబంధిత టీచర్ తప్పుడు సమాచారం ఇవ్వడం వల్లనే ఇలా పొరపాటు జరిగిందని వెల్లడించారు. వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



డీజిల్‌షెడ్‌ను పరిశీలిస్తున్న పీసీఈఈ మీనా

గుత్తి: రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని పీసీఈఈ (ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్) బ్రిజ్ మోహన్ మీనా అన్నారు. గుత్తి ఎలక్ట్రికల్ డీజిల్ షెడ్‌లో శుక్రవారం సికిందరాబాద్‌కు చెందిన పీసీఈఈ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఈసీఎం సెక్షన్‌ను పరిశీలించి, కార్మికులకు పది వేల క్యాష్ అవార్డు ప్రదానం చేశారు. ఎయిర్ బ్రేక్‌ను పరిశీలించి రూ.10 వేలు క్యాష్ అవార్డు ఇచ్చారు. అంతే కాకుండా షెడ్‌కు రూ.25 వేల క్యాష్ అవార్డు ప్రకటించారు. అనంతరం సిమ్లేటర్ టెస్ట్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీజిల్‌షెడ్ ఆవరణలో అధికారులు, కార్మికులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ డీఎంఈ ప్రమోద్, ఏడీఎంఈ అశోక్ గౌడ్, ఎస్‌ఎస్‌ఈ మనోజ్, ఎలక్ట్రికల్ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ గోవిందరాజులు, యూనియన్ నాయకులు చంద్ర, సుంకన్న, సూపర్ వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి



మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

గుంతకల్లుటౌన్: పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని కార్మిక జేఏసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ శుక్రవారం కార్మికులు మున్సిపల్ ఆఫీసు ఎదుట మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు వెళ్లి మానవహారంగా నిలిచి నినాదాలు చేశారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకూ సమాన పనికి సమాన వేతనమివ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో కార్మిక జేఏసీ సహాయ కార్యదర్శి సురేంద్ర, నాయకులు మస్తాన్, లక్ష్మీనారాయణ, సుంకన్న, సతీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్

గుంతకల్లుటౌన్: ఎన్నికల్లో ఆటో కార్మికులకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పార్టీలిచ్చిన హామీలను అమలు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయినా ఆటోకార్మికులకిచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఆటో కార్మిక రంగంపై భారంగా మారిన జరిమానాలను రద్దు చేస్తామని, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని, వాహన మిత్ర కింద రూ.15 వేలు చెల్లిస్తామన్న హామీలన్నీ నీటి మూటలుగా మారాయన్నారు. హామీలను అమలు చేయకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్, రామ్‌దాస్, ఆటోయూనియన్ నాయకులు గోపి, రామాంజి, షేక్షా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'తల్లికి వందనం' అందాలి



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి రూరల్: అర్హులందరికీ తల్లికి వందనం పథకం అమలు చేయాలని చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. తల్లికి వందనం పథకం అమలులో భాగంగా అనర్హులైన వారి వద్దకు వెళ్లి ఎందుకు పథకం రాలేదో వివరించాలన్నారు. స్వయంగా వెళ్లి అర్హులైనా అనర్హులుగా జాబితాలో పేర్లు వచ్చినట్టు అయితే.. వాటిని సరిదిద్దాలన్నారు. ఐదు రోజుల్లో అనర్హులుగా ప్రకటించిన ప్రతి ఇంటికీ విద్యుత్, రెవెన్యూ, మునిసిపల్, ఆర్టీఓ, విద్యాశాఖల అధికారులు, సిబ్బంది కలిసి వెళ్లాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శివరామక్రిష్ణ, తహసీల్దార్ రజాక్‌వలి, ఎంఈఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రస్తా సమస్యకు పరిష్కారం

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లిలో జంగాల కాలనీకి వెళ్లే రస్తా సమస్యకు శుక్రవారం అధికారులు పరిష్కారం చూపారు. గ్రామంలో నుంచి జంగాల కాలనీకి ప్రైవేటు వ్యక్తుల స్థలంలో నుంచి వెళ్లాల్సి ఉండేది. గతంలో ప్రైవేటు వ్యక్తులు కాలనీకి వెళ్లే దారికి అడ్డు వేయడంతో జంగాల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. తమ కాలనీకి దారి చూపాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఓబులేసు గ్రామానికి చేరుకుని ఇరువర్గాల వారితో చర్చించారు. గ్రామ ఫీల్డ్ మ్యాప్‌ను పరిశీలించి సర్వే చేశారు. గ్రామంలోని ప్రభుత్వ భూమి నుంచి జంగాల కాలనీకి వెళ్లేందుకు దారిని చూపారు. జంగాల కాలనీకి వెళ్లేందుకు ప్రభుత్వ అనుమతితో దారి చూపామని ఎవరైనా అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, సీఐ హెచ్చరించారు. అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్లకుంట రమేష్‌బాబు, గ్రామస్తులు రఘు, నరసింహులు, వెంకట్రాముడు పాల్గొన్నారు.

సజావుగా వాహనాల వేలం

తాడిపత్రిటౌన్: పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం తుప్పు పట్టిన ద్విచక్ర వాహనాలకు డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 వాహనాలకు రూ. 67,850 ఆదాయం వచ్చిందని సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అలాగే రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన వేలంలో 15 ద్విచక్ర వాహనాలకు రూ. 57,820 ఆదాయం సమకూరిందని సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

విమాన ప్రమాద మృతులకు వైఎస్సార్‌సీపీ నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట అహమ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ భాస్కర్ మాట్లాడుతూ విమాన ప్రమాదాలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు, సర్పంచ్ పార్వతి, నాయకులు పూల నారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, బయపరెడ్డి, లక్ష్మీనారాయణ, రాజా, గంగరాజు, పెద్ద కొండయ్య, పూల ప్రసాద్, ఆది, నాగలింగ, పూల రవి, సత్యనారాయణ, విజయ కుమార్, పవన్ సాయి, కుళ్లాయప్ప, సత్య నారాయణరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాండురంగ స్వామి ఆలయాభివృద్ధికి విరాళాలు

యాడికి: మండల కేంద్రంలో ఉన్న రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయ అభివృద్ధి పలువురు దాతలు విరాళాలు అందజేశారు.100 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయ శిథిలావస్థకు చేరుకోవడంతో రెండు సంవత్సరాల క్రితం కొంతమంది గ్రామపెద్దలు, భక్తులు ముందుకు వచ్చి ప్రహరీ, ఆలయ రాజగోపురం, గుడిలో టైల్స్ వేసి దేవాలయాన్ని జీర్ణోద్ధరణ చేసి ఆలయంలో దూప దీప నైవేద్యాలకు కొరత లేకుండా చేశారు. దేవాలయాన్ని ఇంకా అభివృద్ధి చేస్తుండటంతో మరికొంత మంది భక్తులు విరాళం అందించేందుకు ముందుకు వస్తున్నారు. బెంగళూరులో స్థిరపడిన సత్యనారాయణ తన తండ్రి నాగరాజు జ్ఞాపకార్థం రూ.25 వేలు, ధర్మవరానికి చెందిన మెటికల కుళ్లాయప్ప రూ.5 వేలు, తాడిపత్రికి చెందిన విశ్వనాథ్ రూ.5 వేలు, గుత్తి నాగేంద్ర రూ.5 వేలు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందించారు.

రేపు కంటి వైద్య శిబిరం

పామిడి: పట్టణంలోని భావసార క్షత్రియ కల్యాణ మండపంలో పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ నెల 15న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు, అధ్యక్షుడు రఘువీరా శుక్రవారం తెలిపారు. అదనపు సమాచారం కోసం 9440550000, 9866589899 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'ప్రజా సమస్యలు పరిష్కరించాలి'

యల్లనూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో శుక్రవారం ఇన్‌చార్జి తహసీల్దార్ రాము సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నారాయణమ్మ, సర్వేయర్ శర్వాణి, వీఆర్వోలు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు



వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

గుంతకల్లుటౌన్: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్ట్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. పత్రికా స్వేచ్ఛను కాలరాసిన కూటమి ప్రభుత్వానికి ఈ తీర్పు కనువిప్పు కావాలని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని గౌరవ న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో గాడితప్పిన పాలనకు హెచ్చరిక లాంటిదన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా బుద్ధి తెచ్చుకుని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు ఆపి ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని వైవీఆర్ సూచించారు.

భక్తిశ్రద్ధలతో గంధం ఉరుసు



అలంకరణలో హజరత్ సయ్యద్ ఖాదర్ మొహిద్దీన్ షా

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో చెరువు కట్ట వద్ద హజరత్ సయ్యద్ ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రీ సాహెబ్ దర్గాలో గంధం ఉరుసు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూల చాందినీ డెకరేషన్లతో డప్పులు వాయిద్యాల నడుమ జిల్లా కేంద్రం నుంచి దర్గా ప్రాంగణానికి చేరింది. బనగానిపల్లి సాహెబ్ కుమారులు హజరత్ సయ్యద్ హుసేన్, బాదుషా, యమని, వారిచే సలాంప ఫాతెహా ఖానీ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వేడుకలకు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి స్వామి వారి శిష్యులు విచ్చేశారు. వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సిబ్బందితో కలసి సీఐ పుల్లయ్య బందోబస్తు నిర్వహించారు.

ఫ్యాన్సీ దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్టు

గుంతకల్లు టౌన్: దుకాణంలో చేతి వాటాన్ని ప్రదర్శించిన ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్ట్ చేశారు. గుంతకల్లు వన్‌టౌన్ ఏఎస్‌ఐ థామస్ డెన్నీ తెలిపిన మేరకు... గత నెల 19న గుంతకల్లులోని ధర్మవరం గేట్ రోడ్డులోని అరుణాచల వరల్డ్ ఆఫ్ ఫ్యాషన్స్ దుకాణానికి కర్నూలు నగరంలోని చెంచు నగర్‌కు చెందిన చెంచు గోవిందమ్మ, చెంచు లక్ష్మి వెళ్లారు. ఆ సమయంలో దుకాణ యజమాని, సిబ్బంది దృష్టిని ఏమార్చి దాదాపు రూ.25 వేలు విలువ చేసే వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలను అపహరించారు. రెండు గంటల అనంతరం వచ్చిన మరో కస్టమర్లకు చూపించేందుకు వెతికితే ఆభరణాలు కనిపించలేదు. దీంతో దుకాణ యజమాన్ని బద్రీనాథ్ వెంటనే సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించడంతో ఇద్దరు మహిళలు నగలను అపహరిస్తున్న దృశ్యాలు కనిపించాయి. చోరీకి పాల్పడిన సదరు మహిళలు శుక్రవారం అదే దుకాణానికి రావడంతో సిబ్బంది పసిగట్టి నిలదీశారు. దీంతో మహిళలిద్దరూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు స్థానిక ట్విన్ లైన్ వద్ద మహిళలను గుర్తించి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.25 వేలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

కానిస్టేబుల్ వీరంగం

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ కేంద్రంలో ఓ పోలీసు కానిస్టేబుల్ వీరంగం సృష్టించాడు. ఈయన అనంతపురం నగరంలో పని చేస్తుండగా.. భార్య 'స్పౌజ్' కోటా కింద బదిలీకి దరఖాస్తు చేసుకుంది. అనంతపురం రూరల్ మండలంలో ఖాళీ లేకపోవడంతో దగ్గరగా అంటే గార్లదిన్నె మండలంలో కోరుకోవాలని అధికారులు సూచించారు. లేదా బత్తలపల్లి మండలం తీసుకోవాలని చెప్పారు. అయితే కానిస్టేబుల్ మాత్రం తన భార్యకు కనగానపల్లి మండలం ఇవ్వాలంటూ పట్టుబట్టాడు. గార్లదిన్నె, బత్తలపల్లి మండలాలు తీసుకునేందుకు ససేమిరా అంటూ వాగ్వాదానికి దిగాడు. అరగంటకు పైగా పంచాయితీ తేలకపోవడంతో సామాన్య టీచర్లు తిరగబడే పరిస్థితి నెలకొంది. చేసేది లేక చివరకు గార్లదిన్నె మండలం తీసుకోవాల్సి వచ్చింది.

కమిషనర్‌కు వినతి

గుత్తి: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు రామదాసు, రాజు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి రమేష్, రైతు సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు వెంకటరాముడు పాల్గొన్నారు.



తేరన్నపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



ఎండలోనే భోజనం చేస్తున్న కూలీలు

సేద తీరేందుకు చోటేదీ?

తాడిపత్రిటౌన్: ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు సేద తీరేందుకు నీడ కన్పించడం లేదు. పనుల వద్ద వసతులు కల్పించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎండలో పనులు చేసస్తున్న కూలీలు కాసేపు సేద తీరాలన్నా.. కనీసం తెచ్చుకున్న భోజనం తినాలన్నా నీడ లేక అవస్థలు పడుతున్నారు. దీంతో ఎండలోనే భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొందని తాడిపత్రి మండలం తేరన్నపల్లిలో ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఉపాధి పనులు వద్ద నీడ, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు.